క్లుప్తంగా...

రేపు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో రేపు జాబ్‌మేళా నిర్వహిస్తున్న ఉపాధి అధికారి నందిగామ మైత్రి ప్రియ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిత్య బిర్లా రిటేల్, జీటీసీఎల్ కంపెనీ తదితర సంస్థలలోని 100 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, ఐటీఐ ద్వారా ఏదైనా ట్రేడ్, డిగ్రీ ఉత్తీర్ణత కలిగి ఉండి 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు ఎంప్లాయిమెంట్ వెబ్‌సైట్ www.employment.telangana.gov.in, 83284 28933 లలో సంప్రదించవచ్చు.

రేపు సినారే జయంతి వేడుకలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 26న రవీంద్రభారతిలో డాక్టర్ సి.నారాయణ రెడ్డి 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు శృతిలయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకురాలు ఎస్పీ.శైలజ, సినీ దర్శకుడు ఎస్.శంకర్, ఎల్లూరి శివారెడ్డికి సినారే పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి హరీష్‌రావు, శాసన మండలి సభ్యులు ఎస్.మధుసూదనచారి, సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారు సుబ్బారావులతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

వైభవంగా కలశ్ శోభాయాత్ర



అబిడ్స్: బేగంబజార్ పుర వీధుల్లో కలశ్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. బృందావన్ నుంచి వచ్చిన అనిరుద్ చార్యుజీ మహారాజ్ రథంలో నుంచి ఊరేగింపు నిర్వహించారు. బేగంబజార్ పురవీధుల్లో మహారాజ్‌కు భక్తులు ఘన స్వాగతం పలికారు. గోషామహల్ రోడ్డులో బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, పూజవ్యాస్ బిలాల్, పప్పుమాత్రే, అనిత, సంతోషి, పుష్పలతో పాటు పలువురు నాయకులు వేదిక ఏర్పాటు చేసి శోభాయాత్రకు ఘన స్వాగతం పలికారు.

గోల్కొండ జోన్ సదర్ ఖాజీగా అలీమొద్దీన్



గోల్కొండ: గోల్కొండ జోన్ ప్రభుత్వ సదర్ ఖాజీగా ఖాజీ మహ్మద్ అలీ మొద్దీన్ బైజీద్ హుస్సామి నియమితులయ్యారు. ఆయన రెండు దశాబ్దాలుగా ఖాజీగా విధులు నిర్వహిస్తున్నారు. గోల్కొండలోని సదర్ ఖాజీగా ఆయనను నియమిస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. మహ్మద్ అలీమొద్దీన్ బైజీద్ హుస్సామి మాట్లాడుతూ.. వధూవరులకు ఇస్లామి పద్ధతిలో నిఖా చేయడమే తన లక్ష్యమన్నారు. గోల్కొండ జోన్ ఏరియాలో లంగర్‌హౌస్, వార్డు 9, 13, గోల్కొండ ఈస్ట్‌లో వార్డు 9, గోల్కొండ వెస్ట్‌లో వార్డు 9లోని 4, 5, 6, 10 బ్లాకులు వస్తాయని ఆయన అన్నారు.

హెల్మెట్ల పంపిణీ



నాంపల్లి: మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు సోమవారం రాష్ట్ర శాసన మండలిలోని తన కార్యాలయంలో 'గిఫ్ట్ ఏ స్మైల్'కార్యక్రమంలో భాగంగా శాసన మండలిలో పనిచేసే సిబ్బందికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. మనోహర్, ఆనంద్‌కుమార్‌గౌడ్, అశ్విన్‌మార్గం, ప్రదీప్ అగర్వాల్, సంజయ్, మురళీ, ఖలీం పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ హన్మంతరాయుడు రచించిన ఏడడుగులు పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. విశ్రాంత డీజీపీ టి.కృష్ణప్రసాద్, విశ్రాంత ప్రొఫెసర్ టి.జయరాజు, నవలా రచయిత సుధామ, డాక్టర్ సహదేవుడు, భావనాకుమార్ పాల్గొన్నారు.

మూసీ ఒడ్డున ముప్పు



మూసీ ఒడ్డునే ఉన్న గుడిసెలు

- నది సమీపం నుంచి కదలని గుడిసెవాసులు
- పునరావాస కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం విఫలం
- భారీ వర్షాలు కురిస్తే 100 గుడిసెలకు ప్రమాదం

జియాగూడ: వర్షాల కారణంగా జంట జలశయాల నుంచి మూసీ నదిలోకి నీరు చేరుతుంది. ఏ మాత్రం వర్షాలు అధికమైనా మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న 100కు పైగా గుడిసెవాసులు మునక తప్పదు. జియాగూడ, కార్వాన్, పురానాపూల్ మూసీ ఒడ్డున కర్నూల్, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన వారు గుడిసెలు వేసుకుని చిత్తుకాగితాలు సేకరించే ఉపాధి కొనసాగిస్తున్నారు. ప్రతి యేటా కురుస్తున్న భారీ వర్షాలకు గుడిసెలలోకి నీరు రావడం ఆనవాయితీగా మారింది. అయినప్పటికీ గుడిసెవాసులకు ప్రత్యామ్నాయ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదు. దీంతో ప్రతి యేటా గుడిసెవాసులకు మూసీ నదిలో వదిలే నీటి కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. వీరు కొనసాగించే చిత్తుకాగితాల ఉపాధి వల్ల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతాయని ఎవరూ అద్దెకు గదులు సైతం ఇవ్వరు.

20 ఏళ్ల నుంచి ఇక్కడే..

20 ఏళ్ల నుంచి రాయలసీమ, కర్నూల్, ఆంధ్రా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధి కోసం జియాగూడ మూసీ ఒడ్డున వచ్చి ఉంటున్నారు. అప్పట్లో ఏ మాత్రం వర్షాలు పడకపోవడంతో ఇబ్బంది కలుగలేదు. ప్రస్తుతం రెండు మూడు సంవత్సరాల నుంచి వర్షాలు అధికంగా పడుతుండడంతో మూసీ నదిలోకి నీరు వదులుతున్నారు. దీంతో ఒడ్డున ఉన్న గుడిసెవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాల కారణంగా అప్పట్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈసారి కూడా సమస్య తలెత్తినప్పటికీ పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి గుడిసెవాసులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం తరలించి పట్టించుకోదని దీంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రవాహం పెరుగుతుందని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపినప్పటికీ మొండి ధైర్యంతో గుడిసెలలో ఉంటున్నారు. అధికారులు గుడిసెవాసులను సౌకర్యాలతో కూడిన షెల్టర్లకు తరలించినట్లయితే వెళ్తామని వారు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ప్రమాదం జరుగకుండా గుడిసెవాసులకు సౌకర్యాలతో కూడిన షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎండీ లైన్స్ వద్ద పిల్లల కోసం ప్లే గ్రౌండ్



గోల్కొండ: ఎండీ లైన్స్ చౌరస్తా పరిసరాల్లో పిల్లల కోసం ప్లే గ్రౌండ్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన ఎండీ లైన్స్, శాతం చెరువు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దర్గానగర్‌కు చెందిన స్థానిక పిల్లలు ఆయనను కలిశారు. ఆటలంటే తమకు ఎంతో ఇష్టమని, అయితే ప్లే గ్రౌండ్ లేక గల్లీలోనే ఆడుకుంటున్నామని, ఈ సందర్భంగా పిల్లలు ఆయనకు తెలిపారు. తాను ఔత్సాహిక క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించానన్నారు. గోల్కొండ ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేసి అక్కడ ఫ్లడ్‌లైట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఒవైసీ ప్లే గ్రౌండ్‌లో స్థానిక యువకులు క్రికెట్ ఆడుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఒవైసీ ప్లే గ్రౌండ్‌లోనే స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మకు మారు బోనాలు



తొట్టెలకు పూజలు నిర్వహించిన కార్పొరేటర్ దర్శన్, మదిర సత్యనారాయణ

జియాగూడ: ఇమాంపురా బస్తీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మారు బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ నవభారత్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ముందుగా మాతేశ్వరీ ఆలయానికి భారీ ఎత్తున తొట్టెల సమర్పణ, ఊరేగింపు, ప్రత్యేక పూజలు ఒడిబియ్యం, బోనాలను మహిళలు పెద్ద ఎత్తున సమర్పించారు. అఖండ హారతి, అన్నప్రసాదం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ, ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, వై.జశ్వంత్‌కుమార్, ఎం.మహేష్‌బాబు, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, ఎం.దర్శన్, ఆలయ కమిటీ సభ్యులు డి.లక్ష్మీనారాయణ, ఆర్.బాలకిషన్, డి.సంతోష్‌కుమార్, సి.పురుషోత్తం, వై.యాదయ్య, జి.మహేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం సంతాప దినాలు



ట్రయన్ రన్‌లో ముజ్తాబా మూస్వి, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ

డబీర్‌పురా: పాతబస్తీ బీబీకా అలావాలో మొహర్రం సంతాప దినాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని ఈనెల 29న పాతబస్తీ ప్రధాన వీధుల్లో నిర్వహించే బీబీకా ఆలం సామూహిక ఊరేగింపు సందర్భంగా సోమవారం ఉదయం పాతబస్తీ ప్రధాన వీధుల్లో ఏనుగు అంబారీపై ట్రయల్ రన్ (రిహార్సల్) నిర్వహించారు. ఈ ట్రయన్ రన్ ఊరేగింపును రాష్ట్ర బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, మర్కజీ మతామి అంజుమన్ అధ్యక్షులు ముజ్తాబా మూస్వి, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ తదితరులు పాల్గొని ప్రారంభించారు. డబీర్‌పురా బీబీకా అలావా వద్ద ప్రారంభమైన ఈ రిహార్సల్స్ (ట్రయల్ రన్) డబీర్‌పురా, షేక్ ఫైజ్ కమాన్, యాకుత్‌పురా రోడ్డు, ఎతేబార్ చౌక్, ఆలిజాకోట్లా, చార్మినార్, గుల్జార్‌హౌజ్, పంజేషా, మీర్ ఆలం మండి, దారుషిఫా, ఆజాఖానా జహేరా మీదుగా చాదర్‌ఘట్ వరకు కొనసాగింది. ఈ ట్రయన్ సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. దక్షిణ మండలం డీసీపీ సాయిచైతన్య, అడిషనల్ డీసీపీ ఆనంద్, మీర్‌చౌక్ ఏసీపీ ఎస్.ఆర్.దామోదర్‌రెడ్డితో పాటు హసన్ ఉద్దీన్ ఐజాజ్, మునావర్, సయ్యద్ అబ్బాస్ నవాబ్ ఆబేదీ, ముస్తాక్ హుసేసన్, గులాం పంజేతన్ పాల్గొన్నారు.

'మధు కవనం' కవితా సంపుటి ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: భాష ఏదైనా కవితాక్షరాలు సమాజ హితాన్ని కోరుతూ జాతిని జాగృతపరుస్తాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అన్నారు. సోమవారం తెలుగు వర్సిటీ ప్రాంగణంలో డాక్టర్ బుర్రా మధుసూదన్‌రెడ్డి రచించిన 'మధు కవనం'గ్రంథాన్ని ఆవిష్కరించిన ఆయన ప్రసంగించారు. మధు కవనం కవితా సంపుటిలో గ్రామీణ వాతావరణం బడుగుల బతుకు వెతలు, యువ చైతన్య అంశాలనే కవితా వస్తువులుగా చేసుకుని పామరులకు సహితం అర్థమయ్యేలా కవితలను పండించారని కొనియాడారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. మన తీపి చేదు జీవన అనుభవాలను పునాదులుగా చేసుకుని సమాజ అవలక్షణాలు, సుగుణాలను తనదైన శైలిలో కవితాక్షరాల రూపంలో కవితలను రాయడం జరిగిందని, చదువరులను ఆకర్షిస్తే గ్రంథానికి ప్రయోజనం ఒనగూరుతుందని అన్నారు. నేటినిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాసు, సాహితీవేత్త డాక్టర్ మచ్చ హరిదాసు, హాంకాంగ్ తెలుగు సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పీచపాటి జయ, విశ్రాంత డీఈఓ అనభేరి రాజేశ్వరరావు, కవి బొమ్మకంటి కిషన్, అనుముల దయాకర్ పాల్గొన్నారు.

'దళిత బంధు'లో దళారులను నమ్మకండి



దళిబంధు దరఖాస్తు ఫారాలను ఎమ్మెల్యే రాజాసింగ్‌కు అందజేసిన దృశ్యం

అబిడ్స్: దళితబంధు పథకంలో ఎవరైనా కమీషన్ అడిగినా దళారులుగా ప్రవర్తిస్తే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. కొంత మంది దళారిలు దళితబంధు ఇప్పిస్తామంటూ లబ్ధిదారులను మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధూల్‌పేటలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలెక్టర్ కార్యాలయానికి చెందిన దళితబంధు విభాగం అధికారి యాదయ్య దరఖాస్తు ఫారాల నమూనాను ఎమ్మెల్యే రాజాసింగ్‌కు అందజేశారు. అనంతరం రాజాసింగ్ సింగ్ మాట్లాడుతూ.. దళితబంధులో దళారి వ్యవస్థను అరికట్టేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన దళితులందరికీ ప్రభుత్వం దళితబంధు ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి దళితబంధు పథకాన్ని విజయవంతం చేయాలన్నారు.



షేక్‌పేట్ నాలా-నానల్‌నగర్ మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్

గోల్కొండ: షేక్‌పేట్ నాలా, టోలిచౌకి చౌరస్తా, నానల్‌నగర్, ఫ్లోర్ మిల్ తదితర ప్రాంతాలు ట్రాఫిక్‌కు ప్రధాన సమస్యలుగా మారాయి. పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ఉన్నా ఫలితంగా లేకుండా పోయింది. టోలిచౌకి నుంచి మెహిదీపట్నం వెళ్లడానికి 20 నిమిషాలకు పైగానే పడుతుంది. నానల్‌నగర్ జంక్షన్ వద్ద ఒకేసారి లంగర్‌హౌస్ వైపు వెళ్లే వాహనాలు, మెహిదీపట్నం వైపు వెళ్లే వాహనాలు వందల సంఖ్యలో ఆగిపోతున్నాయి. మెయిన్ రోడ్డుపై లంగర్‌హౌస్ వైపునకు వెళ్లే వారి కోసం ఒక లైను, మెహిదీపట్నం వైపు వెళ్లే వారి కోసం మరొక లైన్ ఏర్పాటు చేస్తే మెహిదీపట్నం వైపు వెళ్లే వారికి ఎటువంటి ఆటంకాలు ఉండవు. దీని కారణంగా ఫ్లోర్ మిల్ వద్ద కూడా ఇదే దుస్థితి నెలకొని ఉంది. లంగర్‌హౌస్ వైపు నుంచి నానల్‌నగర్ వైపు వెళ్లడానికి అరకిలోమీటర్ దూరం కూడా లేదు. అయితే అరకిలోమీటర్ ప్రయాణానికి కనీసం 15 నిమిషాలు పడుతుంది. ఫ్లోర్ మిల్ ఎదురుగా ఉన్న రోడ్డుపై ఉన్న డయాగ్నోస్టిక్ సెంటర్ల ముందు రోడ్డుపై పార్కింగ్ చేసి ఉంటున్న కార్ల కారణంగా రహదారి ఇరుకుగా మారుతున్నది. మరో వైపు ఫ్లోర్ మిల్ నుంచి టోలిచౌకి వైపు వెళ్లే వారు ఫ్లోర్ మిల్ నుంచి సాలార్జంగ్ కాలనీ మీదుగా వెళ్తున్నారు. దీని వల్ల సైతం వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకునిపోతున్నాయి. టోలిచౌకి ఫ్లోర్ మిల్, షాగౌజ్ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వెలిసిన డబ్బాలు, హోటళ్లు కూడా ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నాయి.

ఏపీ గవర్నర్‌ను కలిసిన ఎస్.పి.భారతి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న ఎస్‌పి.భారతి

గన్‌ఫౌండ్రీ: కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యురాలు ఎస్.పి.భారతి సోమవారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న పలు సాంస్కృతిక సంగీత సేవా కార్యక్రమాలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ తరపున కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యురాలుగా నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు.

బోనాలు సంస్కృతికి ప్రతీక



మాట్లాడుతున్న సినీ నటి రాగిణి

గన్‌ఫౌండ్రీ: బోనాల పండగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పలువురు ప్రముఖులు అన్నారు. సోమవారం సైఫాబాద్‌లోని కళాభవన్‌లో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమి ఆధ్వర్యంలో తెలంగాణ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాట్య గురువులకు తెలంగాణ కిరణం అవార్డులను అందజేశారు. అంతకు ముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటి రాగిణి, నృత్య గురువు డాక్టర్ టి.సందీప్, ఫిట్‌నెస్ నిపుణులు అణుప్రసాద్, ఎన్‌సీసీ అధికారి మేజర్ వి.జయసుధ, సంస్థ వ్యవస్థాపకురాలు విజయమాధవి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్

యాకుత్‌పురా: లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులతో కలిసి పర్యటించి చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని అజ్మత్‌నగర్, మౌలాకాచిల్లా, యాకుత్‌పురా రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో నాలాలు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లో పూడికతీత పనులు చేపట్టామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జీహెచ్ఎంసీ మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లతో పాటు పార్టీ తరఫున నాయకులు, కార్యకర్తలతో సహాయక చర్యల్లో పాల్గొంటున్నామన్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులకు విశిష్ట సేవా పత్రాల అందజేత



మీర్జా ఎక్బాల్ అహ్మద్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు సివిల్ పోలీసుల్లాంటి వారని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండలో పలువురు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులకు విశిష్ట సేవా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా శాంతిభద్రతలను కాపాడటంతో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఎప్పుడు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ రాజు వస్తాద్, ఇలియాజ్ అలీ, ఆబెద్, పరమానందం తదితరులున్నారు.

డబ్బు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు

విజయనగర్‌కాలనీ: గృహ నిర్మాణం చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి డబ్బులు డిమాండ్ చేయడంతో అతడిపై ఫిర్యాదు చేసిన ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్ఐ. మహ్మద్ జాహెద్ తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నం ఉషోదయకాలనీలో నివసించే బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ గత సంవత్సరం గృహ నిర్మాణం చేపడుతుండగా దిడ్డి పెంటయ్య అనే వ్యక్తి వచ్చి ఇంటి ఫొటోలు తీసుకుని, జీహెచ్ఎంసీకి కంప్లెయింట్ చేసినట్లుగా తెలిపారన్నారు. నీ బిల్డింగ్ కూల్చివేయకుండా ఉండడానికి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశాడని ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా పలువురి నుంచి డబ్బులు వసూలు చేయడమే కాకుండా సాబేర్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ భూములను అమ్ముకున్నాడని ఆరోపించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

4వ అంతస్తు నుంచి ఇనుప రేకులు మీదపడి కార్మికుడి మృతి



మృతి చెందిన ఫరీద్

అబిడ్స్: ఓ భవనంలోని 4వ అంతస్తు నుంచి ఇనుప రేకులు కింద పడడంతో ఓ కార్మికుడు మృంతిచెందగా.. మరో కార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ విషాదకర సంఘటన అబిడ్స్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అబిడ్స్‌లోని కళిష్ వస్త్ర షోరూమ్‌లో టోలిచౌకీలోని లేబర్ అడ్డాకు చెందిన ఫరీద్(27), మరో ముగ్గురు కార్మికులను సోమవారం పనిచేసేందుకు తీసుకువచ్చారు. 4వ అంతస్థు నుంచి ఇనుప రేకులను తాళ్లు కట్టి కిందకు తీస్తుండగా ఆ రేకులు ఇద్దరు కార్మికులపై జారిపడ్డాయి. దీంతో తీవ్రంగా గాయపడిన ఫరీద్ మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు తెలిపారు. మరో కార్మికుడు రౌఫ్ (26)కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

అబిడ్స్ జోన్ బృందం: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు జోరుగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, పూజవ్యాస్ బిలాల్‌తో పాటు పలువురు నాయకులు బియ్యం సంచులు, నోట్‌బుక్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. అదేవిధంగా మమతాగుప్తా, సంతోష్‌గుప్తా, ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆలా పురుషోత్తమ్‌రావు, ఆర్‌వీ మహేందర్, శంకర్‌లాల్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు బేగంబజార్ ఫిష్‌మార్కెట్ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



బియ్యం బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న నందకిశోర్‌వ్యాస్ బిలాల్ తదితరులు



బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని



పూజలు చేస్తున్న మమతాగుప్తా, ఆనంద్‌కుమార్‌గౌడ్, శంకర్‌లాల్‌యాదవ్



పుస్తకాలు అందజేస్తున్న పూజవ్యాస్ బిలాల్ తదితరులు



అన్నదానం నిర్వహిస్తున్న ఆల పురుషోత్తమ్‌రావు శాంతిదేవి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684